సాక్షి

Page No: 20



# చేపల ఎగుమతులు పెంచుతాం

## ఓషన్‌శాట్-2 గ్రౌండ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో సీఎం

- గ్రౌండ్‌స్టేషన్‌ని ప్రారంభించిన కేంద్రమంత్రి విలాస్‌రావ్
- త్వరలోనే 'మేఘా ట్రోపిక్స్', 'సరళ్' ప్రయోగం: ఇస్రో

హైదరాబాద్, న్యూస్‌లైన్: సముద్ర పరిశోధనలు మానవాళికి మేలు చేయాలని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అభిలషించారు. హైదరాబాదులోని 'భారత జాతీయ మహాసముద్రాల సమాచార సేవల కేంద్రం' (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్-ఇన్‌కాయిస్)లో ఏర్పాటు చేసిన 'ఓషన్‌శాట్-2' ఉపగ్రహ సమాచార స్వీకార కేంద్రం(గ్రౌండ్ స్టేషన్) ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 'ఇన్‌కాయిస్' అందించే సముద్ర పరిశోధనల సమాచారం మత్స్యకారులకు ఎంతో ఉపయోపడుతుందని, దీని ఆధారంగా రాష్ట్రంలో చేపల ఎగుమతులను ప్రస్తుతం ఉన్న రూ.11 వేల కోట్ల నుంచి ₹20 వేల కోట్లకు పెంచుతామన్నారు. శాస్త్ర సాంకేతిక పరిశోధనల ఫలితాలు సామాన్యులకు ఉపయోగపడినప్పుడే వాటి ప్రయోజనం నెరవేరుతుందన్నారు. రాష్ట్రంలో 960 కి.మీ. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్నందున దీనివెంట మత్స్య పరిశ్రమతోపాటు నౌకాశ్రయాలు, పరిశ్రమలు నెలకొల్పడానికి సముద్ర సమాచార కేంద్ర సూచనలు, సలహాలు అందించాలని కోరారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి విలాస్ రావు దేశ్‌ముఖ్ గ్రౌండ్‌స్టేషన్‌ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తూ ఓషన్‌శాట్-2 ద్వారా ఈ కేంద్రం అందించే సముద్ర సమాచారం లక్షమంది మత్స్యకారులకు ఉపయోగపడుతుందన్నారు. వారు దీన్ని ఉపయోగించుకుని తమ ఆదాయాన్ని రెండుమూడు రెట్లు పెంచుకోవచ్చన్నారు. 'ఇన్‌కాయిస్' ముందస్తుగా, సకాలంలో అందించే సమాచారం మత్స్యకారులు ఇంధనం పొదుపుచేసుకోవడానికి, ప్రాణాలు కాపాడుకునేందుకు తోడ్పడుతుందన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చైర్మన్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ వాతావరణ పరిశోధనల కోసం అక్టోబర్‌లో 'మేఘా ట్రోపిక్స్' శాటిలైట్‌ను ప్రయోగిస్తామని, ఆ తర్వాత మహా సముద్ర పరిశోధనలకోసం 'సరళ్' ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తున్నట్లు పునరుద్ఘాటించారు. 'సరళ్' ఉపగ్రహంతో వ్యవసాయం, నీటి వనరులు తదితర అధ్యాయాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 'ఇన్‌కాయిస్' డైరెక్టర్ సతీష్ చంద్ర షెనాయ్, ఎర్త్‌సైన్సెస్ మంత్రిత్వశాఖ కార్యదర్శి శైలేష్ నాయక్ ప్రసంగించారు. ఈ సందర్భంగా 'ఇన్‌కాయిస్' కేంద్రంలో జాతీయ సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థను కిరణ్‌కుమార్‌రెడ్డి, విలాస్‌రావుదేశ్‌ముఖ్ తదితరులు సందర్శించారు.




సోమవారం హైదరాబాద్‌లో ఓషన్‌శాట్-2 సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్. చిత్రంలో సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇస్రో చైర్మన్ రాధాకృష్ణన్ తదితరులు